


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# అమర్ నాథ్

## (సినిమా రంగం – 1954 సంచిక నుంచి )




బాల్యంలోనే రంగమెక్కి రాణించగలిగిన వారిలో అమరనాథ్ ఒకరు. ప్రఖ్యాత నాటక రచయిత మానాపురం అప్పారావు గారిని ఆంధ్రదేశంలో ఎరుగని వారరుదు. ఈయన తమ్ముడే అమర్ నాథ్. ఈయన వైజాగ్ లో మానాపురంలో పుట్టి తన చదువుల్ని రాజమండ్రిలో ఇంటర్ దాకా సాగించారు. టౌవున్ మిడిల్ స్కూలులోనూ, వీరేశలింగం హైస్కూలులోనూ, ఆర్ట్సు కాలేజీలోనూ చదువుకొన్నారు. 1943 సంవత్సరంలో ఇంటర్ ముగించుకొని వైజాగ్ లో సివిల్ సప్లయిస్ రేషనింగు ఆఫీసులో ఉద్యోగం సంపాదించుకున్నారు.

ఈయన తండ్రి పేరు సన్యాసిరావు. తల్లి రామాయమ్మగారు. ఈ దంపతులకు ఇద్దరు కొమారులు, ఇద్దరు కుమార్తెలు. జేష్టకుమారుడే మానాపురం రామారావుగారు. ద్వితీయ కుమారుడైన అమర్ నాథ్ రేషన్ ఆఫీసులో ఫుడ్ ఇన్స్పెక్టరుగా పనిచేస్తుండేవారు.

అమర్ నాథ్ చదువుకుంటున్న రోజుల్లో స్కూలు నాటకాలలో వేషాలు వేస్తూ వుండేవారు. ఈయన నాటకరంగమెక్కడానికి వీరి టౌన్ మిడిల్ స్కూలు హెడ్ మాస్టరు పెమ్మరాజు రామారావుగారి ప్రోత్సాహమే కారణం! హెడ్ మాస్టర్ గారి ప్రోత్సాహబలంతో అమర్ నాథ్ గారు ప్రప్రథమంగా 'తులాభారం' నాటకంలో సత్యభామ వేషం వేశారు.

అప్పుడు ఈయనకు మేకప్ చేసింది కచదేవయాని, జీవనజ్యోతి చిత్రాలకు దర్శకులైన ద్రోణంరాజు చినకామేశ్వరరావుగారు. అటు తర్వాత ఈయన 'గయోపాఖ్యానం' లో కొన్ని సమయాలలో కృష్ణుని పాత్ర, కొన్ని సమయాలలో అర్జునుడి పాత్ర, 'లవకుశ'లో లవుని పాత్ర తులాభారంలో కొన్ని సమయాలలో నారదుని పాత్ర ధరిస్తూ వుండేవారు.

ఆ రోజుల్లో గుణేశ్వరరావుగారు కృష్ణ అమెచూర్ కంపెనీ అనే సంస్థను ప్రారంభించి కొన్ని నాటకాలను ప్రదర్శించడం మొదలు పెట్టారు. వీరి నాటకాలు ఆంధ్రదేశంలో అనేక చోట్ల ప్రదర్శించుకోగలిగినవి. ఈయన తర్వాత ఈయన కుమారుడు ఈ నాటక సమాజాన్ని నిర్వహించడం మొదలు పెట్టారు. వీరి నాటకాలలో మంచి పేరు నార్జించిన వాటిలో 'హరిశ్చంద్ర' ఒకటి. ఇందులో అమర్ నాథ్ లోహితాసుని వేషం కడుతూ వుండేవారు. ఆ రోజుల్లో అమర్ నాథ్ తో కలిసి నాటకాలాడుతున్న వాళ్ళలో కోటి సూర్యం, నాగరాజు, వుల్లాజ్జాక్షి ముఖ్యులు. వీరందరూ పై నాటక సమాజంలో చేరి వైజాగ్; ఈస్టు గోదావరి జిల్లాలలో నాటకాలను ప్రదర్శిస్తూ వుండేవారు.

అమర్ నాథ్ చదువుకుంటున్న రోజుల్లోనే ప్రమీలతో వివాహం జరిగింది. 1951 – 52 సంవత్సరంలో ఈయన రేవతీ నాట్యమండలి తరపున రేవతీ సాంఘిక నాటకాలలో పాల్గొంటూ వుండేవారు. అంతేగాక ఈయన అన్నగారి నాటకాలలో కూడ ఈయన ఎక్కువగా వేషాలు కడుతూ వుండేవారు.

ఈయన స్వయంగా పాడగలరు. ఈయన పాడిన కొన్ని పాటలు కూడా H.M.V రికార్డులో మీరు వినేవుంటారు. ఈయనగారు పాడిన 'ఇది నా సంకల్పం', 'గౌతమ బుద్ధ', 'ఛల్ మోహనరంగా' మొదలైన పాటలు ఆంధ్ర ప్రజానీకం రుచి చూచినవే! ఇవిగాక ఈయన మరికొన్ని కామిక్ పాటలు కూడా పాడారు. కానీ అప్పట్లో అంటే ఆ రోజుల్లో ఈయన తన అసలు పేరుతో అంటే యం. సత్యన్నారాయణ పట్నాయక్ అన్న పేరుతో వ్యవహరించబడుతూ వుండేవారు. మరి ఈయనకు 'అమర్ నాథ్' అన్న పేరు ఎలా వచ్చింది? అని నన్ను మీరు అడుగవచ్చు. ఈయన సినిమారంగంలో ప్రవేశించబోతూ తన అసలు పేరును మార్చుకోవలసి వచ్చింది. ఇందుకు కారకులు దర్శకులు యోగానంద్. యోగానంద్ గారు యం. సత్యనారాయణ పట్నాయక్ పేరును అందంగా ఆకర్షణీయంగా వుండడానికి 'అమర్ నాథ్' అని మార్చేశారు. అప్పట్నుంచి యం. సత్యన్నారాయణ పట్నాయక్ 'అమర్ నాథ్' పేరుతో తెరకెక్కి ఆ పేరుతోనే వ్యవహరించబడుతూ వున్నారు.

ఈయన ఉద్యోగం చేస్తున్న రోజుల్లో కూడా వైజాగులో విశాఖ నాటక మండలిలో ప్రతినెలా చంద్రగుప్త, ఆంధ్రజ్యోతి, వినాయకుడి పెళ్ళి, బ్లాక్ మార్కెట్టు, రేవతి మొదలగు నాటకాలలో పాల్గొంటూ వుండేవారు. స్టేజి మీద ఈయనను చూచిన పూర్ణాపిక్చర్స్ మంగరాజు గారు ఈయనను సినిమాల్లో చేరమని ప్రోత్సాహించి ఈయనను మద్రాసుకు పంపించారు. అమర్ నాథ్ మద్రాసుకు సినిమా రంగంలో ప్రవేశించడానికి రావడానికి పూర్వమే అనగా ఈయన తన 13వ ఏట ఫోర్తు ఫారం చదువుకుంటున్న రోజుల్లో శారదారాయలసీమ వారి 'జయప్రద'లో ప్రప్రథమంగా నటించారు. ఈ చిత్రంలో అమర్ నాథ్ పురూరవ చక్రవర్తి కుమారుని పాత్రను ధరించారు. 'లవకుశ' నాటకంలో కె.వి.సుబ్బారావు గారు అమర్ నాథ్ ను చూచి జయప్రదలో నటించడానికి బుక్ చేయించారు. ఈ చిత్రంలో సి.యస్.ఆర్. బళ్లారి లలిత, యశోద మొదలగువారు కూడా నటించారు. తన 13 వ ఏటనే తొలిసినిమా అనుభవాన్ని రుచిచూచిన అమర్ నాథ్ మళ్ళీ ఈ రంగంలో అడుగుపెట్టడానికి మద్రాసు చేరుకొని ఎర్రా అప్పారావు ద్వారా డైరక్టర్ యోగానంద్ గారి పరిచయం సంపాదించుకొన్నారు. డైరెక్టర్ యోగానంద్ గారు అమర్ నాథ్ ను ప్రసాదుగారికి పరిచయం చేయించారు. ప్రసాద్ గారు అమర్ నాథ్ ను చూచి ఈయన చిత్రరంగంలో ప్రవేశించడానికి తగ్గ అర్హతలు గలవారే అని గ్రహించి అమర్ నాథ్ ని తెరపై కెక్కించడంలో తగు శ్రద్ధ తీసుకొని తన పర్యవేక్షణంలో తయారుకానున్న కృష్ణా పిక్చర్స్ వారి 'అమ్మలక్కలు'లో శ్రీ యన్.టి.రామారావు గారి తమ్ముడి పాత్రను ఇచ్చారు. ఈ చిత్రంలో లలిత, పద్మిని తదితరులు కూడా నటించారు. ఈ చిత్రం తమిళంలో కూడా తయారయింది.

ఈ చిత్రం తర్వాత చిత్రపు నారాయణమూర్తి గారు అశోకా పిక్చర్స్ వారి 'నా చెల్లెలు'లో ప్రధాన పాత్ర ధరించడానికి అమర్ నాథ్ ను బుక్ చేసుకున్నారు. ఈ చిత్రంలో బలిజేపల్లి, సూర్యకళ, చలం మొదలగు వారు కూడా నటించారు. ఈ చిత్రం తర్వాత అమర్ నాథ్ కు భరణీ వారి 'చండీరాణి' లో నటించడానికి అవకాశం లభించింది. ఈ చిత్రంలో ఈయన రంగారావు, రామారావు, భానుమతి, రేలంగి మొదలగువారితో నటించారు. ఈ చిత్రం తర్వాత శ్రీ యన్.టి.రామారావు గారు అమర్ నాథ్ ను నేషనల్ ఆర్టు పిక్చర్స్ 'పిచ్చి పుల్లయ్య' లో నటించడనికి అవకాశమిచ్చారు. ఈయన రాజరాజేశ్వరీ వారి 'లక్ష్మి'లో కన్నాంబ, గిరిజ, రామశర్మ, కృష్ణకుమారి, రేలంగి మొదలగువారితో నటించారు. ఈ చిత్రంలో ఈయన విలన్ బాలు పాత్రను కడు సమర్ధతతో నిర్వహించిన సంగతి మనకందరికీ విధితమే! ఈయన చక్రపాణిలో ఏ.నాగేశ్వరరావు గారితోనూ, భానుమతితోనూ నటించి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించిన సన్నివేశాలను ఈ నాటికీ మనం మరువలేము. ఈయన 'పల్లెపడుచు'లో గెస్టు ఆర్టిస్టుగా (జమీందార్)గా నటించారు.

ఆదుర్తి వారి దర్శకత్వాన సాహిణీవారు నిర్మించిన 'అమరసందేశం' లో అమర్ నాథ్ గారు ప్రధాన ప్రాత్రను ధరించి తన నటనా చాతుర్యం చేత ప్రేక్షకుల హృదయాలను ఆకర్షించుకోగలిగారు. ఈ చిత్రం ఈయన ఖ్యాతిని సంపాదించుకోడానికి చక్కగా తోడ్పడిందనే అనాలి. ఈ చిత్రంలో శ్రీరంజని(జూనియర్) పద్మిని, రేలంగి మొదలగు వారు కూడా నటించారు. ఈ చిత్రం తరువాత ఈయన వి.ఎస్.పి. వారి 'ఆడబిడ్డ'లో క్యాసప్, రేలంగి, అమ్మాజీ, కాంచన్ మొదలగువారితో నటించారు. ఈ చిత్రం ఎర్రా అప్పారావు గారి దర్శకత్వాన తయారైయింది. గోకుల్ వారు రజనీకాంత్ దర్శకత్వాన నిర్మించిన 'వదిన గారి గాజులు' లో అంజలీ, జమున, చలం మొదలగువారితో నటించారు. గోకుల్ వారు ప్రస్తుతం నిర్మించదలచుకొన్న 'కనకతార' లో కూడా అమర్ నాథ్ నటించ బోతున్నారు. ఈమధ్య భాస్కర్ ప్రొడక్షన్స్ వారిచే భాస్కరరావు దర్శకత్వాన తయారై ప్రజాదరణను పొందగలుగుతున్న చిత్రం 'చెరపకురా చెడేవు'లో ఈయన బహుచక్కగా నటించి ఉత్తమ నటులలో ఒకరని అనిపించుకొన్నారు. ఈ చిత్రంలో యన్.టి.రామారావు, ఆర్.నాగేశ్వరరావు, రేలంగి మొదలగువారు కూడా నటించారు. ఏ.నాగేశ్వరరావు, రంగారావు, చలం, శ్రీరంజని జూనియర్ మొదలగు వారు నటించిన సాధనా వారి 'సంతానం'లో కూడా ఈయన నటించారు.

ప్రస్తుతం ఈయన జి.వియస్. వారి చిత్రంలో గ్రుడ్డివాని వేషం ధరిస్తున్నారు జైరాజ్ ఫిలిమ్స్ వారు సి.వి.రాజు దర్శకత్వాన కన్నడంలో నిర్మిస్తున్న 'భక్తమల్లికార్జున' లో భక్తిరస పాత్రను నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో నాయకిగా పండరీబాయి నటిస్తూ వుంది. ఈ చిత్రంలో జయశ్రీ, రమాదేవి, బేబి ఆర్యకుమారి మొదలగు వారు కూడా నటిస్తున్నారు. విజయదశమి నాడు ఈయన భక్త మల్లికార్జునిడిగా కన్నడ ప్రేక్షకులకు వెండితెర మీద దర్శనమివ్వబోతున్నారు.

ఈయన నటించిన చిత్రాలలో అశోకా వారి 'నా చెల్లెలు' ఈతనికి చక్కటి ప్రోత్సాహన్నిచ్చింది. సాహినీ వారి 'అమర సందేశం' మంచి ఖ్యాతిని తెచ్చి పెట్టింది. అమర్ నాథ్ తీరిక సమయాలలో పుస్తకాలు, పత్రికలు చదువుకుంటూ వుంటారు. తన అభిమానుల ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు వ్రాయడమే గాక కోరిన వారికి తన ఫోటో కూడా పంపుతూ వుంటారు. ఈయన ప్రస్తుతం 8.నార్తు క్రీసెంట్ రోడ్డులో నివసిస్తూ వున్నారు. తమ అభిమానుల ప్రోత్సాహమూ, అభిమానము, ఆదరణను కోరేవారిలో అమర్ నాథ్ ఒకరు.

ఆయన గురించి ఒక్క మాటతో చెప్పదలచుకుంటే ఈయన నిగర్వి, నిరాడంబర జీవి, చక్కగా చదువుకొన్న వారు. అపరిచితులతో తానొక నటుడన్న సంగతే మరచి, సహజంగానూ స్నేహభావంతోనూ మాట్లాడే స్వభావం గలవారు. తనకిచ్చిన పాత్రలను అతి సులభంగానూ, సహజంగానూ నటించగల శక్తి గలవారు. ప్రశంసనీయమైన ఈయన నటనా కౌశల్యమే ఈతన్ని నానాటికీ అభివృద్ధి పరుస్తూ వుందనడంలో అతిశయోక్తి ఏమీ లేదనుకుంటాను. త్వరలో ఈయన సినిమా రంగంలో ఒక విశిష్టస్థానాన్ని ప్రతిష్టించుకోగలరని విశ్వశిస్తున్నాను.

★★★

COMMENTS